నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 6 అక్టోబర్ 2024 | YADADRI BHUVANAGIRI



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భువనగిరి రైస్ మిల్లర్స్ అసోసియేషన్

# ఖరీఫ్ ధాన్యం దిగుమతి చేసుకోం

- జిల్లా రైస్ మిలర్స్ అసోసియేషన్ అల్టిమేటం
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

యాదాద్రి భువనగిరి అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం దిగుమతి చేసుకోబోమని, ఈ మేరకు జిల్లాలోని 51 మిల్లులు యజమానులు నిర్ణయం తీసుకున్నారని యాదాద్రి భువనగిరి జిల్లా రైస్ మిలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్త వెంకటేశం తెలిపారు. శనివారం భువనగిరి పట్టణంలో జరిగిన అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సీఎంఆర్ చార్జీలు, ట్రాన్స్‌పోర్ట్ కస్టోడియన్, డ్రైవింగ్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, అందుకే ధాన్యం దిగుమతి చేసుకోలేమని పేర్కొన్నారు. పాతికేండ్ల కింద నిర్ణయించిన మిల్లింగ్ చార్జీలు రా రైస్ కు క్వింటాకు రూ.10, బాయిల్డ్ రైస్ కు రూ.20 చొప్పున మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. కరెంటు బిల్లులు, హమాలీ, లేబర్, మిల్ మెయింటెనెన్స్ చార్జీలు అంతకంతకు పెరిగాయని తెలిపారు. బాయిల్డ్ రైస్ 68 శాతం, రా రైస్ 67శాతం కాలక్రమేణా వచ్చిన హైబ్రిడ్ వేరియెంట్ వల్ల ఔట్ టర్న్ సాధ్యమవడం లేదన్నారు. అనంతరం కలెక్టర్ హనుమంతు కే జెండగేకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

# కేసీఆర్ కృషితోనే ఆలేరుకు సాగు నీరు

- మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్



యాదగిరిగుట్ట, అక్టోబర్5 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితోనే గంధమల్ల చెరువుకు సాగు జలాలు వచ్చాయని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్యగౌడ్ స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ నుంచి 15వ ప్యాకేజీ ప్రధాన కాల్వ ద్వారా ఆలేరుకు సాగు నీరు వచ్చిందని తెలిపారు. జగదేవపూర్ మండలంలోని పీర్లపల్లి వద్ద 5వ లింక్ కాల్వ గుండా గంధమల్ల చెరువుకు జలాలు వస్తున్నాయని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఆరోపణలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కసారి ఆలేరుకు వచ్చి చూడాలని హితవు పలికారు. కాళేశ్వరం ఒక మాయ, దగా ప్రాజెక్ట్ అంటున్న రేవంత్‌రెడ్డి ఆలేరు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద వర్షాలు వచ్చి గోదావరి ఉప్పొంగినా కాళేశ్వరం ప్రాజెక్టు చెక్కు చెదరకుండా ఇక్కడి ప్రాంత ప్రజలకు వరద ప్రదాయనిగా మారిందని గుర్తుచేశారు. దండగ అన్న కాళేశ్వరం నుంచి పండుగలా గోదావరి జలాలు ఆలేరుకు పరుగులు తీస్తున్నాయని పేర్కొన్నారు. చుక్కనీళ్లు లేని ఆలేరు ప్రాంతానికి కేసీఆర్ పాలనతోనే సాగు జలాలు అందాయని తెలిపారు. 2018 సంవత్సరంలోనే నవాబ్‌పేట జలాశయం ద్వారా గుండాలకు, 2019లోనే కొండ పోచమ్మసాగర్ ద్వారా బొమ్మల రామారం, తుర్కపల్లి(ఎం) మండలాలకు సాగు జలాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌ది అని గుర్తు చేశారు. గుండాలకు 5 దఫాలు గత ప్రభుత్వం సాగు జలాలను అందజేసిందని పేర్కొన్నారు. ఇక్కడి రైతాంగం కేసీఆర్‌కు హర్షధ్వానాలతో ధన్యవాదాలు చెబుతున్నారని తెలిపారు. ఆలేరుకు సాగు జలాలు వచ్చాయంటే అది ముమ్మాటికీ నాటి సీఎం కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# బుద్ధవనాన్ని సందర్శించిన అశోక-అంబేద్కర్ దమ్మ యాత్ర బృందం



బుద్ధడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న అశోక-అంబేద్కర్ దమ్మయాత్ర సభ్యులు

నందికొండ, అక్టోబర్ 4 : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనాన్ని నేషనల్ బుద్ధిస్ట్ పేలర్నాటి సొసైటీ కౌన్సిల్ మౌర్య బౌద్ధ బిక్కు ఆధ్వర్యంలో అశోక-అంబేద్కర్ దమ్మయాత్ర సభ్యులు శనివారం సందర్శించారు. బుద్ధవనంలోని బుద్ధడి పాదాలకు పుష్పాంజలి ఘటించి బుద్ధవనం, జాతకపార్కు, అవకాన బుద్ధ, మహాస్తూపం, ధ్యానమందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యాత్ర కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం నుంచి దీక్ష భూమి నాగపూర్ వరకు కొనసాగి అక్కడ అశోక విగ్రహ ఏర్పాటుతో ముగుస్తుందన్నారు. ప్రపంచ శాంతి, ప్రపంచ బంధుత్వం నినాదంతో యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. బృంద సభ్యులకు తెలంగాణ తరుపున బిక్కు సద్ధా రక్కిత స్వాగతం పలికారు. కార్యక్రమంలో దమ్మ కమిటీ సభ్యులు దమ్మ ధర్మేంద్రన్, ఉపాసకులు రాజేంద్రన్, కేరళ రాజగోపాలన్ పాల్గొన్నారు.

# పెద్ద పండుగపై చిన్నచూపు

## బతుకమ్మను పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు

- ఆడబిడ్డల పండుగపై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం
- నిర్వహణకు పైసా విడుదల చేయని వైనం
- కనీస సదుపాయాలు కల్పించని దుస్థితి
- బతుకమ్మ చీరల పంపిణీ బంద్
- బీఆర్ఎస్ హయాంలో అంగరంగ వైభవంగా ఉత్సవాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. తెలంగాణ అస్థిత్వ పతాక బతుకమ్మ. మన ఆడబిడ్డల అతిపెద్ద వేడుక. తీరొక్క పూలను తెచ్చి, పేర్చి బతుకమ్మ ఆడడం అన్నది ఓ ఎమోషన్. చిన్నా పెద్ద, ఊరూవాడా ఏకమై సంబురంగా చేసుకునే బతుకమ్మ పండుగను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రజల మనోభావాలను ఖాతారు చేయకుండా పండుగను నిర్లక్ష్యం చేసింది. బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమై నాలుగు రోజులైనా ఆ ఊసే ఎత్తడం లేదు. కనీసం సదుపాయాల కల్పనకు కూడా నిధులు ఇవ్వడం లేదు.

– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ)



యాదగిరిగుట్ట మండలం మల్లాపురం వాగు వద్ద అధ్వానంగా ఉన్న పరిస్థితి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా దసరా పండుగకు ముందు తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. ప్రకృతిలో దొరికే పూలతో బతుకమ్మలను పేర్చి తమ బతుకును చల్లగా చూడాలని ఆడపడుచులు వేడుకుంటారు. రోజుకో పేరుతో తొమ్మిది రోజులు వైభవంగా బతుకమ్మ ఆడుతుంటారు. అలుపు అన్నదే లేకుండా గంటల తరబడి బతుకమ్మ ఆడిన అనంతరం సమీపంలోని చెరువుకట్ట వద్దకు తీసుకువెళ్లి బతుకమ్మలను గంగమ్మ ఒడికి చేరుస్తారు. కానీ ఈసారి పల్లెల్లో ఆ వాతావరణం కనిపించడం లేదు.



యాదగిరిగుట్ట మండలం మల్లాపురం వాగు వద్దకు వేళ్లే దారి ఇలా..

### బీఆర్ఎస్ ప్రభుత్వంలో అంగరంగ వైభవంగా..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను అప్పటి బీఆర్ఎస్ సర్కారు గౌరవిస్తూ ఎంతో ప్రాధాన్యం ఇచ్చేది. ఇందులో భాగంగా ఏటా దసరాకు ముందు బతుకమ్మకు నిధులు కేటాయించి వైభవంగా నిర్వహించేది. పదేండ్లపాటు కనీవినీ ఎరగని రీతిలో ఉత్సవాలు జరిపింది. దాంతో దసరాకు 9 రోజుల ముందే పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొనేది. బతుకమ్మ ఏర్పాట్లు, నిర్వహణ కోసం మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలు నిధులు ఇవ్వడంతో అన్ని ఏర్పాట్లు చేసేవారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించేవారు.

### నిధుల్లేవ్.. వసతుల్లేవ్

బీఆర్ఎస్ సర్కారులో బతుకమ్మ పండుగకు సకల సదుపాయాలు కల్పించేవారు. బతుకమ్మలు ఆడే స్థలాలను శుభ్రం చేయించేవారు. చెరువు కట్టలపై ఉన్న చెత్తాచెదారాన్ని ముందుగానే తొలగించేవారు. ఇందు కోసం జేసీబీలు, డోజర్లు ఉపయోగించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ ఏర్పాట్ల కోసం పైసా విడుదల చేయకపోవడంతో మున్సిపాలిటీలు, గ్రామా ల్లో అధికారులకు కూడా ఎక్కడా ఏర్పాట్లు చేయడం లేదు. కొన్నిచోట్ల పంచాయతీల్లో ఉన్న సిబ్బందితో కంప చెట్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. బతుకమ్మ ఆడే స్థలాల్లో విద్యుద్దీపాలంకరణ ఊసే లేదు. సద్దుల బతుకమ్మ రోజైనా ఏర్పాటు చేస్తారో, లేదోనన్నది సందేహంగా ఉంది. ఇప్పటికే పంచాయతీల్లో కార్యదర్శులు వివిధ పనులకు సొంతంగా నిధులు ఖర్చు చేసినా.. ఇంకా బిల్లులు విడుదల కాలేదు. ఇప్పుడు మళ్లీ ఖర్చులు ఎవరు భరించాలని కార్యదర్శులు వాపోతున్నారు.

### ఆడబిడ్డలకు చీరెలు కూడా బంద్..

కేసీఆర్ హయాంలో ఆడబిడ్డలకు పండుగ కానుకగా బతుకమ్మ చీరలను పంపిణీ చేసేవారు. 2017 నుంచి ఈ కార్యక్రమం చేపడుతూ వచ్చారు. సుమారు 290 రంగులు, డిజైన్లతో చీరెలు అందేవి. జిల్లాలో ఏటా 2.80లక్షల మందికి బతుకమ్మ చీరలు ఇచ్చేవారు. దాంతో చేనేత కార్మికులకు కూడా ఉపాధి దొరికేది. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని రద్దు చేయడంపై మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

### బతుకమ్మను కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదు



ఆడబిడ్డల పండుగ బతుకమ్మను కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదు. గత సీఎం కేసీఆర్ ప్రతి ఏడాది పండుగ ముందు బతుకమ్మ చీరెలు పంపేవారు. ఆ చీరెలను మహిళలు అపురూపంగా తీసుకుని గ్రామాల్లో బతుకమ్మ ఆడేవారు. ఇప్పుడు ఎంగిలి పువ్వు బతుకమ్మ ముగిసినా చీరెలు మాత్రం ఇవ్వలేదు. తెలంగాణ సంస్కృతిని కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయినట్లు ఉంది. ఇప్పటికే చాలా మంది మహిళలు బతుకమ్మ చీరెలను గుర్తు చేస్తుండ్రు. ఇప్పటికైనా ఆడబిడ్డలందరికీ బతుకమ్మ చీరెలు అందజేయాలి.

**- రిక్కల ఇందిరాసత్తిరెడ్డి, మాజీ సర్పంచ్, ఎల్లగిరి, చౌటుప్పల్ మండలం**

# వలిగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా భీమానాయక్



చైర్మన్ భూక్యా భీమానాయక్



వైస్ చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి

వలిగొండ, అక్టోబర్ 5 : వలిగొండ, రామన్నపేట ఉమ్మడి మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలిని నియమిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు శనివారం ప్రకటించారు. చైర్మన్‌గా మండలంలోని అక్కంపల్లి గ్రామానికి చెందిన భూక్యా భీమానాయక్, వైస్ చైర్మన్‌గా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన సింగిరెడ్డి మల్లారెడ్డి, మరో 16 మందితో పాలక మండలిని నియమించారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్, పాలక మండలి సభ్యులకు మిత్రులు, బంధువులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పాలక మండలి సభ్యులు త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు



# సెలవుల్లో సొంతూళ్లకు..

## హైవేపై వాహనాల బారులు

చౌటుప్పల్, అక్టోబర్ 5 : దసరా సెలవుల నేపథ్యంలో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి రద్దీగా మారింది. ఇప్పటికే విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వడం, వీకెండ్ కలిసి రావడంతో హైదరాబాద్ నుంచి ఆంధ్రాతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే వారితో శనివారం వాహనాలు బారులు దీరాయి. చౌటుప్పల్ పట్టణంతోపాటు తంగడపల్లి, వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యింది.

# తాసీల్దార్ల బదిలీ

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 5 : జిల్లాలోని పలు మండలాల్లో పని చేస్తున్న తాసీల్దార్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు కలెక్టర్ హనుమంతు కే జెండగే శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలేరు తాసీల్దార్‌గా పని చేస్తున్న పి.శ్రీనివాస్‌రెడ్డిని కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా, భువనగిరి తాసీల్దార్ ఎన్.అంజిరెడ్డిని ఆలేరుకు, భూదాన్‌పోచంపల్లి తాసీల్దార్ బి.శ్రీకాంత్‌రెడ్డిని భువనగిరికి, కలెక్టరేట్ సూపరిండెంట్‌గా ఉన్న ఎం.మహేందర్‌రెడ్డిని భూదాన్‌పోచంపల్లికి బదిలీ అయ్యారు.



నూతన్‌కల్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

# తుంగతుర్తి ఎమ్మెల్యేపై తిరుగుబావుటా

## ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్న కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు

- ముందస్తు అరెస్టులతో అడ్డుకున్న ఎమ్మెల్యే!
- నూతనకల్ పోలీస్ స్టేషన్ ఎదుట కాంగ్రెస్ నేతల ధర్నా
- ఎమ్మెల్యే తీరును తూర్పార పట్టిన నాయకులు

సూర్యాపేట, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌పై సొంత పార్టీ నేతలు తిరుగుబాటు జెండా ఎత్తారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ధరూరి యోగానందచార్యులు ఆధ్వర్యంలో నియోజకవర్గవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్లు అర్వపల్లి మండల కేంద్రంలోని శనివారం శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. కాగా, తెల్లవారుజామున నాలుగు గంటలకే అసంతృప్తితో ఉన్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు నియోజకవర్గ వ్యాప్తంగా ముందస్తు అరెస్టు చేసి నూతనకల్ స్టేషన్‌కు తరలించారు. దాంతో కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. అధికార పార్టీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం పట్ల నియోజకర్గంలో తమను చూసే గాక ఎమ్మెల్యే తీరు కూడా నవ్వుల పాలయ్యేలా ఉందని ఆ పార్టీ సీనియర్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలు, ధర్నాలు, నిరసనలు చేపడితే ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టు చేయడం చూశాం గానీ.. స్థానిక ఎన్నికల కోసం చర్చించేందుకు సమావేశం పెట్టుకుంటే సొంత పార్టీ నేతలను అరెస్టు చేయించిన ఘనత మా ఎమ్మెల్యేకే దక్కిందంటూ యోగానందచార్యులు అసహనం వ్యక్తం చేశారు. సామేల్‌ను తాము కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పార్టీ కేడర్‌ను కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్థానిక సమస్యలు, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేసుకుంటే అరెస్టు చేయిస్తారా అని ప్రశ్నించారు. తెల్లవారుజామున పోలీసులు కాంగ్రెస్ నాయకుల ఇండ్లపై పడి దొంగలను పట్టుకొచ్చినట్లు పట్టుకొచ్చి నూతనకల్ పోలీస్ స్టేషన్‌లో నాలుగు గంటల పాటు నిర్బంధించడం మీద రాష్ట్ర నాయకత్వం స్పందించాలన్నారు. దీనిపై గాంధీభవన్ మెట్లు ఎక్కుతామని స్పష్టం చేశారు.

### ఎమ్మెల్యేపై వరుసగా రుసరుసలు

తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్‌పై నియోజకవర్గ కాంగ్రెస్‌లో వరుసగా అసమ్మతి చెలరేగుతూనే ఉంది. ఎన్నికల సమయంలో తట్టెడు ఇసుకను కూడా ఎత్తనివ్వనని ఊరూరా తిరిగి ప్రచారం చేసిన ఆయన ఎమ్మెల్యే అయిన తరువాత లారీల కొద్దీ ఇసుక అక్రమంగా తరలుతున్నా కనీసం పట్టించుకోకపోవడం లేదని ఆ పార్టీ నేతలు బహిరంగా విమర్శించారు. మరోవైపు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తుంగతుర్తిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ తన కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించడం గమనార్హం. తాజాగా గురువారం శాలిగౌరారం మండలానికి చెందిన ఓ వ్యక్తి ఎమ్మెల్యే చెప్పడంతోనే పోలీసులు తనను కొట్టారంటూ ఆత్మహత్యా యత్నానికి పాల్పడడం సంచలనంగా మారింది. ఆ మరుసటి రోజే సొంత పార్టీ నాయకుల ముందస్తు అరెస్టులతో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరుకున్నట్లు అయ్యింది.

# కాలేజీలు నడుపలేం

## దసరా తర్వాత నిరవధికంగా బంద్ చేస్తాం

## ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల అల్టిమేటం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో జాప్యమే కారణం
- ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌కు బంద్ నోటీసు



ఎంజీయూ ఇన్‌చార్జీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవికి వినతి పత్రం అందచేస్తున్న ప్రైవేట్ కాలేజీల యాజమానులు

రామగిరి, అక్టోబర్ 5 : ప్రైవేట్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలికంగా చెలించాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ యాజమాన్యాలను బంద్‌కు సిద్ధమయ్యాయి. దసరా సెలవుల తర్వాత కాలేజీలను నిరవధికంగా బంద్ చేస్తామని హెచ్చరించాయి. తమ సమస్యలు పరిష్కరించే వరకు విద్యా బోధన సాగించమని స్పష్టం చేశాయి. అప్పుల ఊబిలో ఉన్న తమ గురించి ప్రభుత్వం పట్టించుకోవాలని, లేని పక్షంలో రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు తెలంగాణ అప్లియేటెడ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్(టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవికి శనివారం బంద్ నోటీసును అందజేశారు.

ప్రభుత్వం అందించే ఫీజు రీయంబర్స్‌మెంట్‌పైనే ఆధారపడి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అర్హత గల విద్యార్థులకు ఉచితంగా విద్యా బోధన చేస్తున్నాయి. అందుకు అయ్యే ఖర్చులను ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు భరిస్తూ వస్తున్నాయి. రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో సర్కార్ జాప్యం చేస్తుండడంతో యాజమాన్యాలు అధ్యాపకుల జీతాలు, భవనాల అద్దెలు, కరెంటు బిల్లులు, యూనివర్సిటీ రుసుములు, బిల్డింగ్ ట్యాక్స్ చెల్లించడానికి నానా అవస్థలు పడుతున్నారు. అప్పు చేసి అవన్నీ చెల్లిస్తున్నామని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత అప్పులకు వడ్డీలు చెల్లించలేక, కొత్త అప్పులు పుట్టక అధ్యాపకులకు, భవనాల యాజమానులకు సమాధానం చెప్పలేకపోతున్నామని వాపోతున్నారు.

### హామీ అమలు చేయని ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా అధికారంలోకి రాగానే ప్రైవేట్ కళాశాలలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్స్‌ను పూర్తిగా అందచేస్తామని, ప్రతి సంవత్సరం బకాయి లేకుండా ఇస్తామని చెప్పింది. కానీ నెలలు గడుస్తున్నా స్పందన లేకపోవడంతో కళాశాల యాజమాన్యాలు బంద్‌కు సిద్ధమయ్యాయి. ప్రైవేట్ డిగ్రీ, బీఈడీ, ఇతర కళాశాలల రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయం మేరకు నల్లగొండ ఎంజీయూ చాప్టర్ అధ్యక్షుడు, నీలగిరి డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ మారం నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు శనివారం ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌కు బంద్ నోటీసు అందజేశారు. నోటీసు అందించిన వారిలో టీపీడీపీఎంఏ ఎంజీయూ ప్రధాన కార్యదర్శి ఎం.సైదారావు, కోశాధికారి డి.ప్రవీణ్, గుండెబోయిన జానయ్య యాదవ్, అసోసియేషన్ ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

### పెండింగ్ రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా తక్షణమే ప్రైవేట్ కళాశాలలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలి. రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో అధ్యాపకుల జీతాలు, బిల్డింగ్ అద్దెలు, ప్రభుత్వం, యూనివర్సిటీకి చెల్లించే వివిధ రకాల ఫీజులు, టాక్సీలను అప్పులు చేసి చెల్లిస్తున్నాం. కళాశాలల యాజమాన్యాల పరిస్థితి దయనీయంగా మారింది. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా అసోసియేషన్ తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఎంజీయూ చాప్టర్ ఆధ్వర్యంలో వర్సిటీ రిజిస్ట్రార్‌కు బంద్ నోటీసు అందించాం. సమస్యను పరిష్కరించే వరకు దసరా సెలవుల తర్వాత ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ఎంజీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ, బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీతోపాటు ఇతర కళాశాలలు తెరువకూడదని నిర్ణయించాం.

**- మారం నాగేందర్‌రెడ్డి, టీపీడీపీఎంఏ ఎంజీయూ చాప్టర్ అధ్యక్షుడు**